సాక్షి వరంగల్
బుధవారం । 16 । అక్టోబర్ । 2024



రామప్ప ఖ్యాతి ప్రపంచానికి చాటాలి

రామప్ప ఆలయ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని ములుగు కలెక్టర్ దివాకర పిలుపునిచ్చారు.

- 10లో ▸



వరంగల్ మార్కెట్‌లో అంతర్గత బదిలీలు

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో విధులు నిర్వర్తించే ఉద్యోగులను బదిలీ చేస్తూ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి నిర్మల ఉత్తర్వులు జారీ చేశారు. - 10లో ▸

గరిష్టం/కనిష్టం
$34^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత వర్షం కురుస్తుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గుట్కా, అంబర్ ప్యాకెట్ల పట్టివేత



దుగ్గొండి: మండలంలోని స్వామిరావుపల్లి గ్రామంలో దాసరి రాజమౌళి కిరాణా షాపులో నిషేధిత గుట్కా, అంబర్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు రూ.రూ. 17,600 విలువగల గుట్కా, అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. నిషేధిత గుట్కా, అంబర్ ప్యాకెట్లు, గుడుంబా విక్రయించినా, రేషన్ బియ్యం నల్లబజారుకు తరలించినా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. రెండుసార్ల కంటే ఎక్కువ కేసులు నమోదైతే పీడీయాక్టు నమోదు చేస్తామని ఎస్సై స్పష్టం చేశారు.

పెండింగ్ కేసులు లేకుండా చూడాలి

చెన్నారావుపేట: ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రలోని పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యంగా ఉండకుండా క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నెక్కొండ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్, ఎస్సై రాజేశ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలియజేయాలి

గీసుకొండ: స్టాఫ్‌నర్సుల నియామకానికి సంబంధించిన అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను డీఎంహెచ్ఓ కార్యాలయ నోటీస్‌బోర్డు, కలెక్టర్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 16, 17 తేదీల్లో సాయంత్రం 5 గంటల వరకు అందజేయాలన్నారు. అభ్యంతరాలు తెలియజేయకుంటే ప్రొవిజనల్ మెరిట్ జాబితాను ఫైనల్ మెరిట్ జాబితాగా భావించి నియామకాలు చేపడతామని పేర్కొన్నారు.

18న 'దిశ' సమావేశం

కాళోజీ సెంటర్: జిల్లా దిశ (జిల్లా అభివృద్ధి సహకార, మానిటరింగ్ కమిటీ) సమావేశం మహబూబాబాద్ ఎంపీ అధ్యక్షతన ఈనెల 18న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని కలెక్టర్ కోరారు.

80 మంది నూతన టీచర్లకు పోస్టింగ్

కాళోజీ సెంటర్: జిల్లాలో డీఎస్సీ–2024 ద్వారా నియామకమైన నూతన ఉపాధ్యాయులకు మంగళవారం పోస్టింగ్ (పాఠశాలల కేటాయింపు) కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా పరిషత్ హాల్‌లో వివిధ కేటగిరీలకు చెందిన 80 మందికి పోస్టింగ్ ఇచ్చినట్లు డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్ తెలిపారు.మిగిలిన వారికి బుధవారం ఉదయం 10 గంటలకు జెడ్పీ హాల్‌లో కొనసాగుతుందని పేర్కొన్నారు. ఏఎంఓ ఉండ్రాతి సృజన్‌తేజ, సీఎంఓ కుడికాల సుభాష్, డీసీఈబీ కార్యదర్శి గారె కృష్ణమూర్తి, సూపరింటెండెంట్ బాబ్జీ, ఏఎస్ఓ వేణుగోపాల్, ఏపీఓ రాజగోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంటు ఎస్‌బీ శ్రీనివాస్, షకీల్ అహ్మద్ పాల్గొన్నారు.

16 నుంచి కళా ఉత్సవ్ పోటీలు

కాళోజీ సెంటర్: మండలస్థాయిలో ఈనెల 16, 17 తేదీల్లో కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించి, ఎంపికైన వారిని జిల్లాస్థాయికి పంపించాలని డీఈఓ ఎం.జ్ఞానేశ్వర్ తెలిపారు. ఈనెల 18న జిల్లాస్థాయి పోటీలు వరంగల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్‌లో నిర్వహించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'డీఈఓ పద్ధతి మార్చుకోవాలి'

కాళోజీ సెంటర్: నూతన ఉపాధ్యాయులకు పాఠశాలలు కేటాయిస్తామని వాయిదా వేసి గందరగోళానికి గురిచేసిన డీఈఓ పద్ధతి మార్చుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్, నాయకులు వెంకటేశ్వర్లు, పూజారి మనోజ్ పేర్కొన్నారు. నూతన ఉపాధ్యాయుల పక్షాన సమస్యను పరిష్కరించే ప్రయత్నంలో భాగంగా మంగళవారం యూనియన్ నాయకులు డీఈఓను కలిసినట్లు వారు పేర్కొన్నారు. తమ నాయకులపై నిర్లక్ష్యంగా మాట్లాడిన డీఈఓ ఒంటెత్తు పోకడలు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల్లో ఖాళీల జాబితా వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెస్తే వరంగల్ జిల్లాలో మాత్రం డీఈఓ కార్యాలయం జాప్యం చేస్తోందని ఆరోపించారు.

దసరా ధమాకా!

ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఆదాయం రూ.28.99 కోట్లు

- తిరిగిన కిలో మీటర్లు 50 లక్షలు
- ఆక్యుపెన్సీ రేషియో 91 శాతం

హన్మకొండ: సద్దుల బతుకమ్మ, దసరా పండుగను ఆర్టీసీ సద్వినియోగం చేసుకుంది. రోజూ నడిచే బస్సులతోపాటు ప్రత్యేక సర్వీసులను నడపడం ద్వారా మరింత ఆదాయం సంపాదించుకుంది. ఈనెల 1 నుంచి 14వ తేదీ వరకు వరంగల్ రీజియన్‌లో టీజీఎస్ ఆర్టీసీ రూ.28.99 కోట్ల ఆదాయాన్ని రాబట్టుకుంది. 14 రోజులపాటు 50 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరిగాయి. 91 శాతం ఆక్యుపెన్సీ రేషియో ద్వారా కిలోమీటరుకు రూ.58 ఆదాయం పొందింది. బతుకమ్మ, దసరా పండుగకు విద్యాసంస్థలు సెలవులు ఇచ్చినప్పటి నుంచి ప్రయాణికుల రద్దీని బట్టి ప్రైవేట్ వాహనాలకు అవకాశం ఇవ్వకుండా సంస్థ వివిధ రూట్లకు సర్దుబాటు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంది.

డిపోల వారీగా ఆదాయం వివరాలు

అత్యధిక ఆదాయం వరంగల్-1 డిపో

	హనుమకొండ	జనగామ	వరంగల్-1	వరంగల్-2	మానుకోట	నర్సంపేట	పరకాల	తొర్రూరు	భూపాలపల్లి
ఆదాయం	373.22	338.69	467.24	393.18	203.02	284.87	223.94	329.99	285.47
కిలోమీటర్లు	6.72	6.16	7.82	7.16	3.46	4.92	3.79	5.22	4.75
ఈపీకే	55.50	54.97	59.76	54.95	58.61	57.89	59.15	63.27	60.07
ఓఆర్	81	94	83	86	103	96	98	104	97

- ఆదాయం (రూ.లక్షల్లో) • తిరిగిన కిలోమీటర్లు (లక్షల్లో)
- ఎర్నింగ్స్ పర్ కిలోమీటరు (ఈపీకే) రూ.లలో • ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) శాతంలో



- పండుగ రోజుల్లో వరంగల్–1 డిపోకు అత్యధికంగా రూ.467.24 లక్షలు ఆదాయం వచ్చింది.
- అతి తక్కువగా మహబూబాబాద్ డిపో రూ.203.02 లక్షలు ఆదాయం సాధించింది.
- వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల్లో ఆక్యుపెన్సీ రేషియోలో తొర్రూరు డిపో 104 శాతంతో అగ్రభాగాన నిలవగా.. మహబూబాబాద్ డిపో 103 శాతంతో ద్వితీయ స్థానంలో నిలిచింది.
- హనుమకొండ 81 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో చివరి స్థానంలో ఉంది.
- తొర్రూరు డిపో కిలోమీటరుకు రూ.63.27 ఆదాయం రాబట్టి కిలో మీటరు లెక్కన వరంగల్ రీజియన్‌లో అగ్రభాగంలో నిలిచింది.
- భూపాలపల్లి డిపో కిలోమీటరుకు రూ.60.07 ఆదాయాన్ని పొంది రెండో స్థానంలో నిలిచింది.
- వరంగల్–1 డిపో 7.82 లక్షల కిలో మీటర్లు బస్సులు నడిపి మొదటి స్థానంలో నిలవగా.. 7.16 లక్షల కిలో మీటర్లు బస్సులు నడిపి వరంగల్–2 రెండో స్థానంలో నిలిచింది.

చివరి మజిలీకి చింత

పిచ్చిమొక్కలతో అధ్వానంగా శ్మశానవాటికలు

- మూత్రశాలలు, నీరు, దహనవాటికలు కరువు
- అంత్యక్రియలు చేయడానికి ఇబ్బందులు
- నర్సంపేట పట్టణంలో 10 వైకుంఠధామాలు

నర్సంపేట: అధికారుల నిర్లక్ష్యం.. నిధుల కొరతతో నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 10 శ్మశానవాటికలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. మృతదేహాలకు అంత్యక్రియలు చేయడానికి కుటుంబ సభ్యులు, బంధువులు ఇబ్బందులు పడుతున్నారు. కనీస వసతులు లేక శ్మశానవాటికలకు వెళ్లిన వారు ఒక్క క్షణం కూడా ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయి.

మున్సిపాలిటీగా మారినా..

నర్సంపేట గ్రామపంచాయతీ నుంచి నగర పంచాయతీగా మున్సిపాలిటీగా అభివృద్ధి చెందింది. పట్టణ పరిధిలోని 13 వేల గృహాల్లో 40 వేల జనాభా ఉంది. వీరిలో 30 వేల మంది ఓటర్లు ఉన్నారు. నర్సంపేటలోని 10 శ్మశానవాటికల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. మాదన్నపేట రోడ్డు–1, 2, వరంగల్ రోడ్డులోని ఆర్టీసీ డిపో సమీపాన, పాకాల రోడ్డు, ద్వారకపేటలోని పసునూరి, ఎంఆర్ ఫంక్షన్‌హాల్ సమీపాన, గిరకలగడ్డ, సర్వాపురం, కమలాపురం, కాకతీయనగర్‌లో శ్మశానవాటికలు ఉన్నాయి.

వీటిలో రెండు సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో పిచ్చి చెట్లతో కనిపిస్తున్నాయి. మాదన్నపేట రోడ్డులోని శ్మశానవాటికలో పాతవి రెండు దహనవాటికలు మాత్రమే ఉన్నాయి. శిథిలావస్థలో మూత్రశాలలు ఉండగా, నీటి సరఫరా అంతంత మా త్రంగానే ఉంది. మరో నాలుగు దహన వాటికల పనులు ప్రారంభమైనా మూడు సంవత్సరాలుగా పనులు ఆగిపోయాయి. వరంగల్ రోడ్డులోని శ్మశానవాటికలో దహనవాటికలు రెండు, టాయిలెట్స్ మాత్రమే ఉన్నాయి. అంత్యక్రియల సమయంలో బట్టలు మార్చుకోవడానికి గదులు లేవు. కమలాపురం, కాకతీయనగర్‌లోని శ్మశానవాటికలకు రూ.20 లక్షల నిధులు విడుదల చేసినా ఇప్పటివరకూ ఎలాంటి పనులు ప్రారంభం కాలేదు.



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న మాదన్నపేట రోడ్డులోని శ్మశానవాటిక

నిలిచిపోయిన మోడల్ శ్మశానవాటిక పనులు

2023లో ద్వారకపేటలోని పసునూరి వైకుంఠధామన్ని మోడల్ శ్మశానవాటికగా తీర్చిదిద్దేందుకు కోటి రూపాయల నిధులు మంజూరు కాగా పనులు సగమే పూర్తి అయ్యాయి. మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో శ్మశానవాటికలు అభివృద్ధికి నోచుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. వినియోగదారుల మండలి, కస్తూర్బా మహిళా మండలి, మహిళా సమన్వయ సమితి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కరుణ, యుగేందర్, గోకా రామస్వామి, తండ సారంగపాణి, గుర్రపు అరుణ, కొమ్మాలు, వెంకట్రాం నర్సయ్య సోమవారం శ్మశానవాటికలను పరిశీలించారు. అభివృద్ధి చేయాలని కమిషనర్‌కు వారు వినతిపత్రం అందజేశారు.

అభివృద్ధి చేయాలి..



పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న శ్మశానవాటికల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా దృష్టి సారించాలి. అంత్యక్రియల సందర్భంగా శ్మశానవాటికలకు వెళితే ఎక్కడ చూసినా పిచ్చి మొక్కలే కనిపిస్తున్నాయి. దహన సంస్కార కార్యక్రమాలకు సదుపాయాలు లేవు. అన్ని రకాల వసతులు కల్పించాలి.

– పెరుక కరుణ, వినియోగదారుల మండలి జాయింట్ సెక్రటరీ, నర్సంపేట

వసతులు కల్పించాలి..



శ్మశానవాటికల్లో ఆహ్లాదకర వాతావరణం కోసం చెట్లను పెంచాలి. అన్ని రకాల వసతులను కల్పించి చివరి మజిలీకి ఇబ్బందులు లేకుండా చూడాలి. అభివృద్ధి పరంగా నర్సంపేట మున్సిపాలిటీకి ప్రత్యేక గుర్తింపు వచ్చే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలి.

– గోకా రామస్వామి, వనప్రేమి అవార్డు గ్రహీత, నర్సంపేట

నిధులు వెచ్చించాలి..



శ్మశానవాటికల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి. మహిళలకు ప్రత్యేకంగా స్నానపు గదులు నిర్మించాలి. పట్టణ అభివృద్ధికి కేటాయించిన నిధుల్లో కొన్ని మున్సిపాలిటీ పరిధిలోని పది శ్మశానవాటికలకు వెచ్చించి సమస్యలు పరిష్కరించాలి. అంత్యక్రియలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– గుర్రపు అరుణ, కస్తూర్బా మహిళా మండలి అధ్యక్షురాలు, నర్సంపేట

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

కాళోజీ సెంటర్: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 2,66,664 మంది లబ్ధిదారులకు 509 రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సంధ్యారాణి తెలిపారు. 919 అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి రాజమణి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలకు రేషన్ దుకాణాల నుంచి బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఫోర్టిఫైడ్ రైస్‌తో రక్తహీనత, పౌష్టికాహార లోపాన్ని అధిగమించవచ్చునని అన్నారు. నిత్యావసర సరుకుల పంపిణీ, వినియోగంపై అధికారులు తనిఖీలు చేయాలని ఆదేశించారు. అవకతవకలకు పాల్పడిన ఏడుగురు రేషన్ డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు రేషన్ దుకాణాలను సీజ్ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, రేషన్ డీలర్ల సంఘం నాయకులు దామోదర్, రాంచంద్రు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సత్య శారద

ఇద్దరు యువకుల ఆత్మహత్య



నితిన్ (ఫైల్)



గణేశ్ (ఫైల్)

సంగెం: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన గీసుకొండ మండలం వంచనగిరిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మోర్తాల మధురాబాయి, నర్సింగరావు దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు నితిన్ (18) ఉన్నారు. నితిన్ అమ్మమ్మ ఊరు వంచనగిరిలో ఉంటూ గీసుకొండ మండలం కొనాయమాకులలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.ఆయన తండ్రి కరుణాకర్ కరోనా సమయంలో మృతి చెందాడు. అమ్మమ్మ రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. తాత వద్ద ఉంటున్న నితిన్ మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రేమ విఫలమై నితిన్ ఆత్మహత్య చేసుకున్నాడని పలువురు చర్చించుకుంటున్నారు. సంఘటనా స్థలాన్ని గీసుకొండ సీఐ మహేందర్ సందర్శించాడు. ఆత్మహత్యకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

అప్పల్‌రావుపేటలో..

నెక్కొండ: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. అప్పల్‌రావుపేట గ్రామంలో దసరా వేడుకల్లో గణేశ్ (22)పై అదే గ్రామానికి చెందిన యువకులు దాడికి పాల్పడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన గణేశ్ ఈ నెల 14న గడ్డి మందు తాగి విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రాత్రి గణేశ్ మతి చెందాడని ఎస్సై పేర్కొన్నారు. తన కుమారుడి మృతికి కారణమైన మచ్చ పర్వీ, కొయ్యాల సుమన్, తాళ్ల సతీశ్, ఈసంపల్లి ప్రవీణ్, కొయ్యాల సతీశ్,తాళ్ల శ్రీను, జిల్లా సుమన్ శిక్షించాలని తల్లి కృష్ణవేణి ఫిర్యాదు చేశారని చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్సై తెలిపారు.

అధికార పార్టీతో పోలీసుల కుమ్మక్కు

- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝాకు లేఖ



సీపీకి లేఖ రాస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: నియోజకవర్గంలో పోలీసులు అధికార పార్టీతో కుమ్మక్కై అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు పోలీసుల తీరును వివరిస్తూ సీపీ అంబర్‌కిషోర్‌ఝాకు మంగళవారం ఆయన లేఖ రాశారు. పోలీసుల వ్యవహార శైలి ప్రజలను అవమాన, కించపరిచే విధంగా ఉందన్నారు. ఏ పార్టీ నాయకులు ఉన్నారనే కోణంతోనే పోలీసులు పిటిషన్లు స్వీకరిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌కు వెళితే తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని లేఖలో వివరించారు. చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్‌లో నలుగురు ఎస్‌హెచ్ఓలు మారారని, నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో 8 మంది ఎస్సైలు, దుగ్గొండి సర్కిల్‌లో ముగ్గురు సీఐలు మారడాన్ని బట్టి చూస్తే పోలీసు వ్యవస్థ తీరు అర్థమవుతోందని పేర్కొన్నారు. నర్సంపేట పట్టణంలో వసూళ్ల దందా, అరాచకాలు, కబ్జాలకు కొందరు పోలీసులు సహకరించడం వంటి ఘటనలు అనేకం ఉన్నాయని చెప్పారు. హింసా, కక్షపూరిత రాజకీయాలకు నియోజకవర్గం వేదికగా నిలుస్తోంని, ఈ అంశంపై సమీక్ష నిర్వహించి ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు అనిత

నెక్కొండ: జాతీయస్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని సూరిపల్లి హైస్కూల్ విద్యార్థి దొమ్మటి అనిత ఎంపికైనట్లు హెడ్‌మాస్టర్ బత్తుల పరమేశ్వర్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 8న నల్లగొండలో జరిగిన ఖేల్ ఇండియా లీగ్–2024 జూనియర్స్, సబ్ జూనియర్ జాతీయస్థాయి ఎంపిక ఖోఖో పోటీలు జరిగాయని పేర్కొన్నారు. తమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని అనిత ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి 18 వరకు తమిళనాడు రాష్ట్రంలో జరిగే పోటీల్లో ఆమె పాల్గొననున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు క్రీడల్లో తగిన శిక్షణ ఇస్తే జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటుతారని హెచ్ఎం వివరించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ సుజాత, మాజీ సర్పంచ్ సింగారపు గీత, మాజీ ఎంపీటీసీ మాదాసు శారద, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు రజియా, ఉపాధ్యాయులు కిషన్‌రావు, శ్రీనివాస్, జోగయ్య, కుమారస్వామి, ప్రభాకర్, నాగేశ్వర్, పందరీబాయి, జ్యోతి, రవి విద్యార్థులు పాల్గొన్నారు.



అనితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బీసీ గురుకులాలకు తాళం!

అద్దె చెల్లించడం లేదని గేట్లకు తాళం వేసిన యజమానులు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 36 గురుకులాలు అద్దె భవనాల్లోనే
- ఏడు మాత్రమే సొంత భవనాల్లో
- మార్చినుంచి ఇప్పటి వరకు చెల్లించని అద్దె
- ప్రతీనెల చెల్లించాల్సింది కనీసం రూ.74 నుంచి రూ.75 లక్షల వరకు

సాక్షిప్రతినిధి, వరంగల్/విద్యారణ్యపురి: మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకులాలకు తాళం పడింది. ఇప్పటికే అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుండగా మరోవైపు నెలల తరబడి అద్దె చెల్లించకపోవడం.. దసరా సెలవులు ముగియడం.. మంగళవారం నుంచి విద్యార్థులు రాక ప్రారంభంకావడంతో మొదటిరోజే అద్దెభవనాల యజమానులు పాఠశాల గేట్లకు తాళం వేసి నిరసన తెలిపారు. పాఠశాలలకు వచ్చిన విద్యార్థులు గంటల తరబడి గేటు బయటే పడిగాపులు కాశారు. కొన్నిచోట్ల ప్రిన్సిపాళ్ల యజమానులకు నచ్చజెప్పినట్లు తెలుస్తోంది. సమస్య తీవ్రత ఎక్కువగా ఉండడంతో సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పరిష్కరించే దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం.

మూడో భాగం గురుకులాలు అద్దె భవనాల్లోనే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 43 వరకు మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకులాలు ఉన్నాయి. ఇందులో ఏడు గురుకులాలకు ప్రభుత్వ భవనాలు ఉండగా, మిగతా 36 అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. వీటికి ప్రతీనెల రూ.74 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు ప్రభుత్వం అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు అద్దె చెల్లించడం లేదు. ఆయా యాజమాన్యాలు తమకు అద్దెబిల్లులు చెల్లించాలని పలుమార్లు కోరినప్పటికీ ప్రభుత్వం నుంచి విడుదల కాకపోవడంతో చివరికి దసరా సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచే రోజు (మంగళవారం) గురుకులాల గేట్లకు తాళాలు వేసి నిరసన తెలిపారు. ఈ విషయమై అద్దెభవనాల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షుడితో ఉమ్మడి జిల్లా ఆర్‌సీఓ ఎం.రాజ్‌కుమార్ ఫోన్‌లో మాట్లాడారు.

అద్దె బకాయిలు చెల్లించేందుకు సంబంధిత ఉన్నతాధికారులు యత్నిస్తున్నారని, బిల్లులు వస్తాయని, సహకరించాలని తెలియజేసినట్లు రాజ్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు. ఉన్నతాధికారులు కూడా సంబంధిత అద్దె యాజమాన్యాలతో మాట్లాడినట్లు సమాచారం. ఆ తర్వాత కొంతవరకు సమస్య సద్దుమణిగి యజమానులు గేట్లకు తాళాలు తీసినట్లు తెలిసింది.

డిగ్రీ కళాశాలలు ఇలా..

బీసీ గురుకులాల్లో మహబూబాబాద్ జిల్లాలో రెండు డిగ్రీ కళాశాలలు, జనగామలో ఒకటి, భూపాలపల్లిలో ఒకటి అద్దె భవనాల్లో ఉన్నాయి. హనుమకొండ జిల్లా కాజీపేటలో మహిళలకు లా కాలేజీ, ములుగు జిల్లాకు మంజూరైన డిగ్రీ కాలేజీ కూడా లా కాలేజీ సొంత భవనంలోనే నడుపుతున్నారు.



వరంగల్ ఉర్సుగుట్టలోని గురుకుల గేట్‌కు యజమాని తాళం వేయడంతో నిరీక్షిస్తున్న సిబ్బంది

జిల్లాల వారీగా బీసీ గురుకులాలు ఇలా..

జిల్లా	మొత్తం	సొంత భవనాలు	అద్దె భవనాలు
హనుమకొండ	12	04	08
వరంగల్	07	00	07
జనగామ	07	01	06
ములుగు	03	01	02
జేఎస్‌భూపాలపల్లి	05	02	03
మహబూబాబాద్	06	00	06

- ములుగు జిల్లాలో మంజూరైన 3 గురుకులాలను అక్కడ ఏర్పాటు చేయకుండా ఒకటి హనుమకొండ జిల్లా శాయంపేటలో, వరంగల్ జిల్లా ఆరెపల్లిలో మరొకటి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఒకటి ఏర్పాటు చేశారు.

గేటు బయటే విద్యార్థులు, ఉపాధ్యాయులు

- అద్దె చెల్లించలేదని గురుకులాల గేట్లకు తాళం
- భవన యజమానుల నిరసన

- వివరాలు 10లో ▸

క్లుప్తంగా

20న ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 20వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తోట శ్యాంప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారుల ఎత్తు, బరువు, వయసు కలుపుకుని 250 పాయింట్లు దాటొద్దని, నవంబర్ 11, 2006 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఉదయం 10 గంటలకు జేఎన్ఎస్‌లోని ఖోఖో స్టేడియం వద్ద ఆధార్, పుట్టిన తేదీ సర్టిఫికెట్లతో ఖోఖో కోచ్ రాజారపు రమేశ్‌ను సంప్రదించాలని సూచించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో కూడిన జిల్లా జట్టు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయిలో పాల్గొంటుందని తెలిపారు.

పండుగకు వచ్చి ప్రాణం తీసుకున్నాడు..

- క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య
- మహబూబాబాద్‌లో ఘటన


సురేశ్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : దసరా పండుగకు ఇంటికి వచ్చిన ఓ యువకుడు క్షణికావేశంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని నందమూరి నగర్ కాలనీకి చెందిన మంజుల సురేశ్ (30), భార్య కల్యాణి, కుమారుడు, కుమార్తెతో కలిసి బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్ వెళ్లాడు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో దసరా సందర్భంగా ఇంటికి వచ్చాడు. పండుగ అనంతరం హైదరాబాద్ వెళ్దామని భార్య కల్యాణి చెప్పగా మద్యం మత్తులో ఉన్న సురేశ్ తరువాత వెళ్దామని చెప్పాడు. తల్లి సత్తెమ్మ, భార్య కల్యాణి.. మద్యం ఎందుకు సేవిస్తున్నావని మందలించగా, మీరు వెళ్లండి నేను తరువాత వస్తానని చెప్పాడు. దీంతో కల్యాణి తన కుమారుడు, కుమార్తెతో కలిసి హైదరాబాద్ వెళ్లడానికి రైల్వే స్టేషన్ చేరుకుంది. బయట ఉన్న తల్లి సత్తెమ్మ ఇంట్లోకి వచ్చి చూడగా సురేశ్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి సత్తెమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్సై జోవెల్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి శవ పంచనామా జరిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

గేటు బయటే విద్యార్థులు, ఉపాధ్యాయులు

అద్దె చెల్లించలేదని గురుకులాల గేట్లకు తాళం | భవనాల యజమానుల నిరసన

తొర్రూరు/ఖానాపురం/చెన్నారావుపేట/దుగ్గొండి/గూడూరు/రేగొండ/ఖిలావరంగల్/భూపాలపల్లి అర్బన్/ములుగు రూరల్: : గురుకులాల భవనాలకు రాష్ట్ర ప్రభుత్వం అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో మంగళవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ బాలుర గురుకులం, మైనార్టీ బాలికల గురుకులం, నాంచారి మడూరులోని బీసీ బాలుర డిగ్రీ గురుకుల కళాశాల గేట్లకు యజమానులు తాళాలు వేసి నిరసన తెలిపారు. దీంతో విధులకు హాజరయ్యేందుకు వచ్చిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆరుబయటే నిరీక్షించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ 8 నెలలుగా ప్రభుత్వం అద్దె చెల్లించలేదని, పాఠశాల భవనాలకు నెలకు రూ.3 లక్షలు, కళాశాల భవనాలకు రూ. 4.50 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉందన్నారు. అనంతరం అధికారుల హామీ మేరకు భవనాల యజమానులు గురుకులాల గేట్లు తెరిచారు.

- గూడూరు మండలంలోని మర్రిమిట్ట శివారు మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల విద్యాలయానికి మంగళవారం భవన సముదాయ యజమాని నితిన్ తాళం వేశారు. సమాచారం అందుకున్న గురుకుల విద్యాలయాల సెక్రటరీ.. వచ్చే నెల 4వ తేదీ లోపు అద్దె డబ్బులు చెల్లిస్తామని ఫోన్‌లో హామీ ఇచ్చారు.
- వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని ఐనపల్లిలోని జ్యోతిరావుపూలే పాఠశాలకు యజమాని మంగళవారం తాళం వేశారు. దీంతో మధ్యాహ్నం వరకు ఉపాధ్యాయులు లోపలికి వెళ్లకుండా ఆగిపోయారు.


చెన్నారావుపేట : భవనానికి తాళం వేస్తున్న యజమాని కంది గోపాల్‌రెడ్డి

- దుగ్గొండి మండలం గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల గేటుకు యజమానులు బైరెడ్డి రాజేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి తాళం వేశారు.
- దుగ్గొండి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల.. చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల హైస్కూల్ భవనంలో కొన్నేళ్లుగా నడుస్తోంది. అంతేకాకుండా ఇందులోనే హాస్టల్ కూడా నడుస్తోంది. అద్దె డబ్బులు చెల్లించకపోవడంతో భవనానికి తాళం వేసినట్లు యజమాని గోపాల్‌రెడ్డి తెలిపారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని లింగాల మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బాలికల హాస్టల్ భవనానికి 8 నెలలుగా అద్దె చెల్లించక పోవడంతో యజమానికి గేటుకు తాళం వేశారు.


గూడూరు: మహాత్మా జ్యోతిరావుపూలే గురుకులానికి తాళం వేస్తున్న భవన యజమాని నితిన్

- అద్దె బకాయిలు చెల్లిచాలని డిమాండ్ చేస్తూ వరంగల్ ఉర్సు గుట్ట వద్ద మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాల భవనానికి తాళం వేశారు. దీంతో కళాశాల సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు బయటే నిరీక్షించారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాశ్‌కాలనీలోని మైనారిటీ గురుకుల పాఠశాల గేట్‌కు భవన యాజమాని నాగుల దేవేందర్‌రెడ్డి తాళం వేశారు. ఉదయం 8గంటలకే తాళం వేయడంతో అధ్యాపకులు సాయంత్ర వరకు గురుకుల పాఠశాల ఎదుటే చెట్ల కింద వేచి ఉన్నారు. విద్యార్థులు తిరిగి ఇంటికి వెళ్లారు.
- ములుగు మండలం మల్లంపల్లిలో అద్దెకు కొనసాగుతున్న ఏటూరునాగారానికి చెందిన గురుకుల పాఠశాలకు యజమాని తాళం వేశారు. సాయంత్రం వరకు సమస్య పరిష్కారం కాకపోవడంతో విద్యార్థులు తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారని పాఠశాల ప్రిన్సిపాల్ అంకయ్య తెలిపారు.

రామప్ప ఖ్యాతి ప్రపంచానికి చాటాలి

- కలెక్టర్ దివాకర టీఎస్
- ఆలయంలో వరల్డ్ హెరిటేజ్ క్యాంపెయిన్ ప్రారంభం



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర టీఎస్

వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని కలెక్టర్ దివాకర టీఎస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని రామప్ప దేవాలయ గార్డెన్‌లో వరల్డ్ హెరిటేజ్ క్యాంపెయినింగ్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారసత్వ సంపదను భావితరాలకు అందించడానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పనిచేయాలని పేర్కొన్నారు. 'వర్కింగ్ ఆన్ ది ఫ్యూచర్' అనే అంశంపై వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్–2024 క్యాంపెయిన్‌ను అక్టోబర్ 15 నుంచి 26 వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 40 మంది వలంటీర్లతో పాటు ఉమ్మడి వరంగల్‌కు చెందిన మరో 40 మంది వలంటీర్లుగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, పర్యాటకం, కాకతీయుల ఇంజనీరింగ్ ప్రతిభ, ఇతర అంశాలపై బోధన తరగతులతో పాటు ఫీల్డ్ ట్రిప్స్ ఉంటాయని, ఈ క్యాంపెయిన్ వలంటీర్లకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పాండురంగారావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యుడు శ్రీధర్‌రావు, జిల్లా టూరిజం అధికారి శివాజీ, అసిస్టెంట్ ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్, యోగా ఇన్‌స్ట్రక్టర్ రాంబాబు, గైడ్‌లు విజయ్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

యాంటీ డ్రగ్స్ టీమ్, పోలీసుల తనిఖీలు


తనిఖీలు చేస్తున్న పోలీసులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేషన్‌లో మంగళవారం యాంటీ డ్రగ్ టీమ్, కాజీపేట పోలీసులు సంయుక్తంగా నార్కోటిక్ డాగ్ సహాయంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంలు, ప్రయాణికులు వేచి ఉండే గదులు, అనుమానాస్పద ప్రయాణికులు, వారి బ్యాగులను తనిఖీ చేశారు. ఈతనిఖీలో కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సైలు లవన్‌కుమార్, నవీన్, యాంటీ డ్రగ్స్ టీమ్ ఇన్‌స్పెక్టర్ జె.సురేశ్, ఆర్ఎస్సైలు పూర్ణచంద్రారెడ్డి, మనోజ్‌రెడ్డి, నాగరాజు, ఆర్ఐ శివకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముడుశాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్

హన్మకొండ చౌరస్తా: మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ముస్లింలకు 3 శాతం రిజర్వేషన్ అమలు చేయడం వల్ల అనేక మంది ఉద్యోగాలు పొందారని, ప్రస్తుత ప్రభుత్వం ఆ రిజర్వేషన్ అమలు చేయాలని ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ అన్నారు. హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం, ముస్లిం వెల్ఫేర్ సొసైటీ, అల్ ఫాయిజన్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దళితుల కంటే ముస్లింలు సామాజికంగా, విద్యా రంగంలో వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లిం సంక్షేమం కోసం కేవలం రూ.2వేల కోట్లు కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో రూ.5వేల కోట్లు చేర్చిందని, త్వరలోనే ఆ నిధులు మంజూరయ్యేలా సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానన్నారు. ప్రతీ పేద ముస్లింకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. కేంద్రంలో కుర్చీ కోసం బీజేపీ సర్కార్ మత విద్వేషాలను రెచ్చగొడుతోందని విమర్శించారు. డాక్టర్ అనీసిద్దిఖీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా, డాక్టర్ జమాలషరీఫ్, డాక్టర్ రజామాలిక్, ప్రొఫెసర్ ముస్తఫా, డాక్టర్ రాజ్‌మహ్మద్, సిరాజ్ అహ్మద్, నయీమొద్దీన్, నస్రీన్ వాహిది, ఇస్మాయిల్ షంషీ, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి వరంగల్ జిల్లా గాయకుల ఎంపిక


మాట్లాడుతున్న వరంగల్ శ్రీనివాస్


నయీంనగర్: 'నూరేండ్ల నా ఊరు' గేయం కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి గాయకులను ఎంపిక చేసి చారిత్రక పాటలో అవకాశం కల్పించనున్నట్లు కవి, గాయకుడు వరంగల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద సంవత్సరాల పల్లె చరిత్ర, మానవ జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, మానవీయ విలువలు చాటి చెప్పేలా అప్పటి యాస, భాషతో కూడిన సాహిత్యాన్ని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో 243 చరణాలు కలిగిన గేయం రచించి దానిని 243 మంది గాయకులతో పాడిస్తామన్నారు. ఇందుకోసం రెండు తెలుగు రాష్ట్రాల ఉంచి గాయకులను ఎంపికచేస్తామన్నారు. మొదట ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ప్రారంభిస్తామన్నారు. రేపు (బుధవారం) కేయూ బైపాస్‌లోని శారదా ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గాయకుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. సమావేశంలో కళాకారులు గిద్దె రాంనర్సయ్య, జూపాక శివ, వెంకన్న, సునీల్, సంజీవ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య ప్రవేశాల గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్ : కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రం అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్, ఓరియంటేషన్ కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు దూరవిద్య కేంద్రం (ఎస్‌డీఎల్‌సీఈ) డైరెక్టర్ వల్లూరి రామచంద్రం మంగళవారం తెలిపారు. ఈనెల 15వతేదీతో గడువు ముగియడంతో పెంపుదల చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. మొత్తం 33 కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నామన్నారు. డిగ్రీలో బీఏ, బీకాం, జనరల్ కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ, బీఎల్, బీఎస్సీ, ఎం.ఏ తెలుగు, ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, హిస్టరీ, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, హెచ్ఆర్ఎం, ఎం.కామ్, సోషల్ వర్క్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎమ్మెస్సీ సైకాలజీ, గణితశాస్త్రం, ఎన్విరాన్మెంటల్ సైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, వృక్ష, జంతు శాస్త్రాలు, ఎంఎల్ఐఎస్సీ ఉన్నాయని తెలిపారు. అలాగే, డిప్లొమా కోర్సుల్లో కంప్యూటర్ అప్లికేషన్స్, గైడ్స్ అండ్ కౌన్సెలింగ్, యోగా, సర్టిఫికెట్ కోర్సుల్లో సీఎల్ఐఎస్సీ, మిమిక్రీలో ఓరియంటేషన్ కోర్సుల్లోనూ ప్రవేశాలు పొందొచ్చన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఫొటో జత చేసి కోర్సు రుసుం ఆన్‌లైన్‌లో కాని దూర విద్య కేంద్రం ఎస్‌బీఐ ఎక్స్‌టెన్షన్ కౌంటర్ నుంచి చలాన్ ద్వారా కాని చెల్లించొచ్చన్నారు. కోర్సులు, ఫీజులు వివరాలకు 0870–24611480,2461490 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

- మృతదేహాన్ని వెలికి తీసి కుటుంబీకులకు అప్పగించిన పోలీసులు


చిరంజీవి (ఫైల్)

రామన్నపేట : ఓ వ్యక్తి కాల్వలో పడి మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ డాక్టర్స్ కాలనీలో చోటు చేసుకుంది. మట్టెవాడ పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ డాక్టర్స్ కాలనీలో నివాసముంటూ ప్రైవేట్ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్న గజ చిరంజీవి(39) సోమవారం రాత్రి 9 గంటల సమయంలో తన బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో తన ఇంటికి సమీపంలోని క్వాలలో కాలుకు అంటుకున్న బురద కడుక్కునేందుకు అందులోకి దిగాడు. ఈ సమయంలో కాలు జారడంతో కొట్టుకుపోయాడు. సురేశ్ అనే వ్యక్తి దీనిని గమనించి చిరంజీవి కుటుంబ సభ్యులకు తెలిపాడు. కాగా, చిరంజీవి మృతదేహం గీసుగొండ మండలం బాలయ్యపల్లి బ్రిడ్జి వద్ద చిక్కుకోగా పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి మంగళవారం కుటుంబీకులకు అప్పగించారు. ఈ ఘటనపై మృతుడి భార్య వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు.

ఆప్త మిత్రుడిని కోల్పోయాం..

- నరేశ్‌రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు
- మాజీ మంత్రి హరీశ్‌తోపాటు పలువురు బీఆర్ఎస్ నేతల నివాళి



నరేశ్‌రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్, రాజ్యసభ సభ్యుడు వద్ది రాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, తదితరులు

మరిపెడ రూరల్: ఆప్త మిత్రుడు నూకల నరేశ్ రెడ్డిని కోల్పోయామని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం విధితమే. కాగా, ఆయన వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం నిర్వహించిన దశ దిన కర్మలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై నరేశ్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేశ్ రెడ్డి కుమారులు అనిరుధ్‌రెడ్డి, అభినవ్‌రెడ్డిని మంత్రులు పరామర్శించారు. అనంతరం మంత్రులు పొంగులేటి, తుమ్మల మాట్లాడుతూ ఫ్యామిలీ రిలేషన్ కంటే కూడా వ్యక్తిగతంగా నరేశ్‌రెడ్డి తమకు ఆప్త మిత్రుడన్నారు. నరేశ్‌రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, భూక్య మురళీనాయక్, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డి, జిల్లా నాయకులు వంటికొమ్ము యుగేంధర్‌రెడ్డి, పెండ్లి రఘువీర్ రెడ్డి, ఘనపురపు అంజయ్య, వేణుగోపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్, గొడుగు శ్రీనివాస్, కాలం శ్రీనివాస్‌రెడ్డి, పానుగోతు రాంలాల్, గంధసిరి అంబరీష, మెంచ్ అశోక్, పటేల్ దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల ఘననివాళి..

నరేశ్‌రెడ్డి దశ దిన కర్మలకు బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నరేశ్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి వెంట రాజ్య సభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, మాజీ ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఓడీ ఎస్ఎంఎస్ చైర్మన్ కుడితి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

సీపీఎం ఆధ్వర్యంలో నూకల నరేశ్‌రెడ్డి చిత్ర పటానికి నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సోమయ్య, గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.


కానిస్టేబుల్ ధరణి కన్నుమూత

- చికిత్స పొందుతూ మృతి


ధరణి(ఫైల్)

నల్లబెల్లి/హసన్‌పర్తి: నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుల్ జోరుక ధరణి(24) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై ప్రశాంత్ బాబు కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెంబర్తికి చెందిన జోరుక రాజేశ్వరి, కుమారస్వామి దంపతుల కూతురు ధరణి నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ పోలీస్ క్వార్టర్స్‌లో ఉంటోంది. తన ద్విచక్ర వాహనం కోసం తీసుకొచ్చిన పెట్రోల్‌ను గదిలో ఉంచింది. ఈ నెల 13న పెట్రోల్ బాటిల్ లీకేజీ కావడంతో గదిలో మంటలు వ్యాపించి ధరణికి అంటుకోగా బయటకు వచ్చింది. ఈ విషయం సహ మహిళా కానిస్టేబుల్ స్వర్ణకు చెప్పింది. అప్రమత్తమైన స్వర్ణ పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తూ కాలిన గాయాలతో ఉన్న ధరణిని పెట్రో కార్‌లో ఎంజీఎంకు తరలించింది. వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ధరణి మృతితో స్వగ్రామం పెంబర్తిలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలి సోదరుడు వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, 2020 బ్యాచ్‌కు చెందిన ధరణి.. పరకాల పోలీస్ స్టేషన్‌లో మొదటి పోస్టింగ్ పొందారు. అనంతరం 2022 సెప్టెంబర్‌లో బదిలీపై నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు.

కళాక్షేత్రానికి ఉర్దూభాష నేమ్‌ప్లేట్ బిగింపు


సాక్షి స్పందన

న్యూశాయంపేట : హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రానికి రాష్ట్ర రెండో అధికార భాష ఉర్దూ నేమ్‌ప్లేట్‌ను బిగించారు. కాగా, కాళోజీ కళాక్షేత్రం పేరు ఉర్దూలో కూడా లిఖించాలని ఆ భాషాభిమానులు, కళాకారులు, కవులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలకు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) అధికారులు స్పందించారు. మంగళవారం కళాక్షేత్రం ఎదుట ఉన్న గ్రిల్స్‌కు తాత్కాలికంగా ఉర్దూ భాషలో లిఖించిన నేమ్‌ప్లేట్ బిగించారు. కాగా, పర్మినెంట్‌గా బిల్డింగ్ పై భాగంలో రేడియం అక్షరాలతో ఉర్దూ నేమ్‌ప్లేట్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు మహ్మద్ నయీం డిమాండ్ చేశారు.

వరంగల్ మార్కెట్‌లో అంతర్గత బదిలీలు

- ఖరీఫ్‌లో విధుల నిర్వహణ కోసమే మార్పులు
- ఖాళీ పోస్టులతో ఉన్న వారిపై అదనపు భారం


వరంగల్ వ్యవసాయ మార్కెట్ ప్రధాన కార్యాలయం

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ప్రధాన కార్యాలయం, లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్‌లో విధులు నిర్వర్తించే సూపర్‌వైజర్లు, ఏఎంఎస్, జేఎంఎస్‌లను పెద్ద ఎత్తున అంతర్గత బదిలీలు చేస్తూ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జి.శ్రీకాంత్(సూపర్‌వైజర్)కు అసెస్‌మెంట్ సెక్షన్ (ఎ టు ఎం), పర్చేజ్ రిటర్న్, మార్కెట్ ఫీజుల వసూళ్లు, జేడీఎం, డీడీఎం, డీఎంఓలకు నివేదికలు పంపించే బాధ్యతలు అప్పగించారు. వినయ్‌కాంత్ యూడీసీకి అసెస్‌మెంట్ సెక్షన్(ఎన్ టు జెడ్), పర్చేజ్ రిటర్న్, మార్కెట్ ఫీజుల వసూళ్లు, జేడీఎం, డీడీఎం, డీఎంఓలకు నివేదికలు పంపించే బాధ్యతలు అప్పగించారు. గంగాధర్(సూపర్‌వైజర్)కు కోల్డ్ స్టోరేజీలు, గోదాంల నిర్వహణ, వాచ్ అండ్ వార్డు ఇన్‌చార్జ్ విధులు అప్పగించారు. వి.స్వప్న (సూపర్‌వైజర్)కు కార్యాలయంలోని ఎస్టాబ్లిష్‌మెంట్–1 సెక్షన్‌తో పాటు ధాన్యం, అపరాల యార్డు పూర్తి ఇన్‌చార్జ్ బాధ్యతలతో పాటు ఈ–నామ్ నిర్వహణ, రైతులకు లాట్ ఐడీల జారీ తదితర బాధ్యతలు అప్పగించారు. డి.లక్ష్మీనారాయణ(యూడీసీ)కు ధాన్యం, అపరాల యార్డు నిర్వహణ అప్పగించారు. మురళీయాదవ్(సూపర్‌వైజర్)ను లక్ష్మీపురం మోడల్ వెజ్ మార్కెట్ పూర్తి ఇన్‌చార్జ్‌గా నియమించారు. సలీం(సూపర్‌వైజర్)ను పత్తి యార్డులో పూర్తి ఇన్‌చార్జ్‌గా నియమించారు. చక్రబహదూర్ (సూపర్‌వైజర్)కు గ్రేయిన్ మార్కెట్‌లోని యార్డుల్లో దడవాయిలకు విధుల కేటాయింపు, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, లైటింగ్ పర్యవేక్షణ అప్పగించారు. సాగర్(సూపర్‌వైజర్)కు అదనంగా మిర్చి యార్డు విధులు కేటాయించారు. డి.నర్సింహ(సూపర్‌వైజర్)కు పత్తి యార్డులో పూర్తి విధులు అప్పగించారు. జ్యోతి ప్రకాశ్ (సూపర్‌వైజర్)మార్కెట్ ప్రధాన కార్యాలయానికి వచ్చే లెటర్లు, దరఖాస్తులు ఇన్‌వార్డులో నమోదు చేసి కార్యదర్శికి, కార్యాలయం నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు పంపే లెటర్లు ఔట్ వార్డ్ నిర్వహిస్తారు. నర్సింగరావు(సూపర్‌వైజర్)కు ప్రధాన కార్యాలయంలో డిమాండ్ సెక్షన్, తక్‌పట్టీ సెక్షన్, బజారు సెక్షన్ల పూర్తి బాధ్యతలు అప్పగించారు. శ్రీనునాయక్(సూపర్‌వైజర్)కు లక్ష్మీపురం పండ్ల మార్కెట్‌లో పూర్తి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. జి.వివేక్(జేఎంఎస్) పత్తి యార్డు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఎం.రజిత(జేఎంఎస్) ప్రధాన కార్యాలయంలోని డిమాండ్, తక్‌పట్టీ సెక్షన్‌తో పాటు మిర్చి యార్డులో సహాయకురాలిగా అదనపు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

సీజన్‌లో ఇబ్బందులు లేకుండా..



రానున్న ఖరీఫ్ సీజన్‌లో వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే రైతులకు సరుకుల కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యార్డుల్లో విధులు నిర్వర్తించేందుకు ఉద్యోగులకు అంతర్గత బదిలీలు నిర్వహించాం. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగానే అక్కడ విధులు నిర్వర్తించేందుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తాం.

-పి.నిర్మల, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి

ఉద్యోగులపై అదనపు భారం...

వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో అన్ని క్యాడర్లు గ్రేడ్–1, గ్రేడ్–2, యూడీసీ, అకౌంటెంట్, ఎల్‌డీసీ, గ్రేడర్, ఏఎస్‌లు, సూపర్‌వైజర్లు, ఏఎంఎస్, జేఎంఎస్‌లతో కలిపి 109 మంజూరు పోస్టులు ఉన్నాయి. ఇందులో 83 పోస్టులు ఖాళీ ఉండగా కేవలం 26 పోస్టుల్లో మాత్రమే ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఖాళీలతో ప్రస్తుతం ఉన్న వారికి అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల యార్డుల్లో పర్యవేక్షణ కొరవడే అవకాశాలు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేస్తే మార్కెట్‌లో పర్యవేక్షణ పెరిగి రైతుల సరుకులకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంటుందని రైతు సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

వ్యక్తి పై కేసు నమోదు

ఖిలా వరంగల్ : చెల్లెపై దాడికి పాల్పడిన అన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. శంభునిపేట విశ్వనాథ కాలనీలో పాలేపాక అరుణ నివాసం ఉండగా.. ఆమె అన్న మస్తాన్ వరంగల్ లక్ష్మీపురంలో నివాసం ఉంటున్నాడు. తన భార్యను తీసుకురావాలని మస్తాన్ తన చెల్లి అరుణ కోరాడు. దీనికి ఆమె నిరాకరించడంతో ఈనెల 12న దాడికి పాల్పడ్డాడు. అరుణ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


రణధీర్, ఏఈ, మిషన్ భగీరథ

చెన్నారావుపేట : మిషన్ భగీరథ ఇంట్రా ఏఈగా రణధీర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మిషన్ భగీరథ ఇంట్రా ఏఈగా విధులు నిర్వహించిన మంగీలాల్ దుగ్గొండి మండలానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో చెన్నారావుపేట ఏఈగా రణధీర్ బాధ్యతలు తీసుకున్నారు.

పంచాయతీ రాజ్ ఏఈగా సృజన్



చెన్నారావుపేట మండల పంచాయతీ రాజ్ ఏఈగా సృజన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పంచాయతీ రాజ్ విభాగంలో చెన్నారావుపేట ఏఈగా బాధ్యతలు తీసుకున్నట్లు సృజన్ తెలిపారు.

సన్మానం



దుగ్గొండి : మండలంలోని రేకంపల్లికి చెందిన గాదం సునీల్ డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందాడు. ఈమేరకు సునీల్‌ను యాదవ సంఘం బాధ్యులు మంగళవారం గ్రామంలో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇమ్మడి యుగంధర్, జక్కుల రాజు, సింగనబోయిన రవి, కాడబోయిన తిరుపతి, స్వామి, ఇమ్మడి రాజయ్య, సతీష్ పాల్గొన్నారు.

దీప్తి జీవాంజికి..



పర్వతగిరి : మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన దీప్తి జీవాంజి ఇటీవల పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించగా మంగళవారం ఎంపీడీఓ మాలోత్ శంకర్‌నాయక్ ఆమెను సత్కరించి అభినందించారు. మండల పంచాయతీ అధికారి పాక శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి చేయూత



రాయపర్తి : మండలంలోని బురహాన్‌పల్లికి చెందిన పేద విద్యార్థిని బాలె రమ్యకు ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి చేయూతనందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్‌నాయక్ రాథోడ్, వల్లాల సుధాకర్‌తో రూ.10వేల నగదును పంపించినట్లు తెలిపారు. ఉన్నతంగా చదివి డాక్టర్‌గా నిరుపేదలకు సేవలందించాలని ఫోన్ ద్వారా మాట్లాడినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్‌కు రమ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ సోమనాథం, యూసుఫ్, యాకూబ్, రంజిత్ పాల్గొన్నారు.

బిట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారు బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన మెకానికల్ ఇంజనీరింగ్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆకారపు శరత్ మిజోరం ఎన్ఐటీలో పీహెచ్‌డీ (డాక్టరేట్) పట్టాను పొందారు. పీహెచ్‌డీ పరిశోధనలో గ్రంథం టూ స్ట్రోక్ పెట్రోల్ ఇంజన్లో పనితీరు మెరుగుదల, ఉద్గార తగ్గింపు కోసం ట్విన్ స్పార్క్ ప్లగ్ టెక్నాలజీ ప్రయోగాత్మక అంచనాపై ప్రొఫెసర్ డాక్టర్ బిదేశ్‌రాజ్ పర్యవేక్షణలో పూర్తి చేశారు. ఈసందర్భంగా డాక్టరేట్ పొందిన శరత్‌ను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్‌లు శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఆర్థికసాయం



సంగెం : మండల కేంద్రానికి చెందిన గుండేటి సంజీవ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా పెద్ద దిక్కును కోల్పోయిన బాధిత కుటుంబానికి గ్రామంలోని వాట్సాప్ గ్రూపులో ఆర్థికసాయం అందించాలని స్థానికుడు పులి రాజశేఖర్ విజ్ఞప్తి చేశాడు. దీంతో దాతలు స్పందించి రూ 13,620లు మృతుడి భార్య, కుమారుడికి మంగళవారం అందజేశారు. దాతలు మెట్టుపల్లి రమేష్, గుండేటి కుమారస్వామి, ఆగపాటి రాజు, గుండేటి శ్రీకర్, పులి సాంబయ్య, కృష్ణ, కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

టీకాతో 'గాలికుంటు'కు చెక్


దుగ్గొండి: తొగర్రాయిలో పశువుకు టీకా వేస్తున్న వైద్యులు, పక్కన ఏడీ బీఎన్ రెడ్డి


నెక్కొండ: పశువుకు టీకా వేస్తున్న డాక్టర్ మమత


పర్వతగిరి: టీకా వేస్తున్న డాక్టర్ రాజు

నెక్కొండ : పశువులకు సోకే గాలికుంటు వ్యాధిని టీకాతో చెక్ పెట్టవచ్చని మండల పశువైద్యాధికారి మమత అన్నారు. మండలంలోని ముదిగొండలో మంగళవారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే నెల 16వ తేదీ వరకు పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు తెలిపారు. నోటి నుంచి నీరు కారడం, తీవ్రమైన జ్వరం, నోటిలోపల పుండ్లు, నాలుక పగలడం, పాదుగు వద్ద బొబ్బలు రావడం గాలికుంటు వ్యాధి లక్షణాలను ఆమె పేర్కొన్నారు. నోటి నుంచి వచ్చే నీరు (సొళ్లు) ద్వారా ఒక పశువు నుంచి మరో పశువుకు వ్యాధి వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. పై లక్షణాలు ఉన్న పశువులకు వెంటనే చికిత్స చేయించడంతోపాటు టీకా వేయించాలని ఆమె పశువుల రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

పర్వతగిరి : పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి కె.రాజు సూచించారు. ఈ మేరకు మండలంలోని అనంతారం గ్రామంలో మంగళవారం పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ఈనెల 15నుంచి నవంబర్ 14వ తేదీ వరకు మండలంలోని ప్రతీ గ్రామంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నేడు(బుధవారం) గోపనపల్లి గ్రామంలో టీకాలు వేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేవీఓ అమరావతి, గోపాలమిత్రులు కుమార్, లక్ష్మణ్, వెంకన్న పాల్గొన్నారు.

దుగ్గొండిలో..

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయి గ్రామంలో మంగళవారం162 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈసందర్భంగా నర్సంపేట పశుసంవర్ధకశాఖ ఏడీ బీఎన్ రెడ్డి మాట్లాడారు. పశువులకు, జీవాలకు సీజన్‌కు అనుగుణంగా వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేయడం జరుగుతుందన్నారు. రైతులు ప్రభుత్వం కల్పించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తొగర్రాయి పశువైద్యాధికారి శారద, వీఎల్ఓ గఫార్, కుమార్, గోపాలమిత్రలు అక్బర్‌పాష, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా పాఠశాల

- ల్యాబర్తి ప్రభుత్వ పాఠశాలలో పడేసిన ఖాళీ మద్యం బాటిళ్లు
- బెల్టు షాపులు రద్దు చేయాలని వినతి


పాఠశాల ఆవరణలో ఖాళీ మద్యం బాటిళ్లు

వర్ధన్నపేట : దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ప్రకటించారు.. దీంతో పాఠశాల వైపు కన్నెత్తి చూసేవారు లేరు.. ఇదే అదనుగా కొందరు ఆకతాయిలు మద్యం తాగడానికి పాఠశాలనే అడ్డాగా మార్చుకున్నారు. మండలంలోని ల్యాబర్తి ప్రభుత్వ పాఠశాల దసరా సెలవుల అనంతరం మంగళవారం పునఃప్రారంభమైంది.దీంతో పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు పాఠశాల ఆవరణలో ఖాళీ బీరు బాటిళ్లు దర్శనమిచ్చాయి. ఇదే విషయాన్ని ఉపాధ్యాయులు గ్రామస్తులకు తెలియపరచగా వారు ఆందోళన వ్యక్తం చేశారు. ల్యాబర్తి, బొక్కలగూడెం గ్రామాల్లో దాదాపు 15 వరకు బెల్ట్ షాపులు ఉన్నాయని.. చీకటి పడితే చాలు యువత బెల్టు షాపుల్లో మద్యం కొనుగోలు చేసి పాఠశాలలో ఆవరణలో సేవిస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్సైజ్ అధికారులు నిఘా వేయడం లేదని.. పోలీసులు గస్తీ తిరగడం మానేయడంతో యువత ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే బెల్టు షాపులను రద్దు చేసి యువత పెడదారిన పడకుండా చర్యలు తీసుకుంటామని ప్రకటించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు 10 నెలలు గడుస్తున్నా.. ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే నాగరాజు గ్రామాల్లో పర్యటించి వాటిని పరిష్కరించాలని కోరుతున్నారు. పోలీస్ ఉన్నతాధికారిగా సేవలు అందించిన ఎమ్మెల్యే గ్రామాల్లో బెల్టుషాపులను పూర్తిగా అరికట్టాలని కోరుతున్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి


నమోదు పత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

నల్లబెల్లి : వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు నక్కిరెడ్డి మహేందర్ కోరారు. ఈ సందర్భంగా ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 6వ తేదీలోపు 3 ఏళ్ల ఉన్నత పాఠశాలలో బోధన చేసిన ఉపాధ్యాయులు తన ఓటును నమోదు చేసుకోవాలన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యా, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్న పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో కలిసి ఓటరు నమోదు దరఖాస్తు పత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఉడుత రాజేందర్, నారక్కపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చంద్రశేఖర్, సీహెచ్ తిరుపతి రెడ్డి, సతీష్ కుమార్, ఈశ్వరయ్య, వెంకట్రామనర్సయ్య, భిక్షపతి, సతీష్, అన్న మహేందర్ రెడ్డి, శనిగరం శ్రీనివాస్, కృష్ణ, వినోద, రాజిరెడ్డి, కృష్ణమూర్తి, మోహన్‌లాల్, రాధిక, సవిత పాల్గొన్నారు.

'త్వరలో ఏకీకృత సర్వీస్ రూల్స్'

గీసుకొండ: ఉపాధ్యాయుల సమస్యలను పీఆర్‌టీయూ పరిష్కరిస్తుందని ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమాన్ని తాను పనిచేస్తున్న జడ్పీహెచ్‌ఎస్ శాయంపేట, వంచనగిరి మోడల్ స్కూల్‌లో హెచ్‌ఎం సంపత్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తామని, పీఆర్‌సీ ఇప్పిస్తానన్నారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న వారికి మినిమం టైం స్కేల్, మోడల్ స్కూల్ వారికి 010 పద్దు ద్వారా జీతాలు, అన్ని యాజమాన్య పాఠశాలల టీచర్లకు హెల్త్‌కార్డులు ఇప్పించే బాధ్యత పీఆర్‌టీయూ తీసుకుంటుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్రావ్, సుధాకర్ రెడ్డి, ఉషాపద్మిని, మండల కార్యదర్శి మాధవి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీత పాల్గొన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి

నర్సంపేట రూరల్ : ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. నర్సంపేట మండలంలోని రాజేశ్వర్‌రావుపల్లి, రాంనగర్ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులపై పంచాయతీ కార్యదర్శి రజియా ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ..2025-26 సంవత్సరాని గాను గ్రామపంచాయతీ పరిధిలో అవసరమయ్యే పలు రకాల పనులను గుర్తించారు. ముందుగా ఈజీఎస్ పథకంలో అమలవుతున్న 266 పనులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు మాటేటి శ్రీను, సురేందర్, శ్రీనివాస్, గ్రామస్తులు ఐల్లయ్య, కృష్ణంరాజు, భూషబోయిన సురేష్, కీసరి చిరంజీవి, రంజిత్, అజయ్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటి కేసు నమోదు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మంద కుమార్

చెన్నారావుపేట : మాదిగులపై దాడులు చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని ఎంఎస్పీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కొందరు అగ్ర కులస్తులు మాదిగలపై దాడులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. మాదిగలపై జరుగుతున్న దాడులను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు పుట్ట రవి, జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్, ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, నాయకులు చిన్నపల్లి రవి, యాకన్న, రాజు, వీరేశం, నరేందర్ ఉన్నారు.

విద్యార్థులకు స్ఫూర్తి..కలాం సందేశం


వర్ధన్నపేట: అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ వెంకటయ్య


ఖానాపురంలో..


చెన్నారావుపేటలో..

వర్ధన్నపేట: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సందేశాలు విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తాయని, ఆయన ఎదిగిన తీరు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.వెంకటయ్య అన్నారు. మంగళవారం అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కలాం జయంతిని ఐక్యరాజ్యసమితి విద్యార్థి దినోత్సవంగా నిర్వహిస్తోందని కొనియాడారు. కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అనే సందేశం ముఖ్యంగా విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజేంద్రప్రసాద్, సంధ్యారాణి, తిరుపతి, డాక్టర్ వేణు మాధవి, రాజ్‌కుమార్, సువర్ణవేణి, రాధిక, ఇతరులు రజిత, ఉమారాణి, ఇద్దమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

ఖానాపురం : మండలంలోని పలు గ్రామాల్లో అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బుధరావుపేట మోడల్ స్కూల్‌లో జయంతి వేడుకలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ అత్యంత కిందిస్థాయి నుంచి రాష్ట్రపతి వరకు ఎదిగిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించగా విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు రవికుమార్, శ్రీధర్, మల్లికార్జున్, రాజేంద్రప్రసాద్,విగ్నేశ్వర్, రాజేందర్, రాజ్‌కుమార్, పద్మావతి, స్రవంతి, సయార, నిర్మల, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్‌లో మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి సిద్దార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అండెం కర్ణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మేడి రమేష్, బొనగాల రమేష్, వల్ల వేణు, కొండపర్తి కృష్ణమోహన్, కందిక నవీన్, కవిత ఉన్నారు.

మద్యం ప్రియులకు జరిమానా, జైలు శిక్ష

నర్సంపేట రూరల్ : మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పలువురిని పోలీసులు పట్టుకొని మంగళవారం కోర్టులో హాజరు పర్చినట్లు నర్సంపేట సీఐ రమణమూర్తి తెలిపారు. నర్సంపేట సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కొత్త లక్ష్మీనారాయణ ఒక్కొక్కరికి ఐదురోజుల జైలుతోపాటు రూ.1,000 జరిమానా విధించినట్లు తెలిపారు. శిక్ష విధించిన వారిలో చింతకింది సురేందర్, మాలోత్ సంతోష్, దార అరుణ్, మహ్మద్ అహ్మద్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక

దుగ్గొండి : మండల కేంద్రానికి చెందిన బొమ్మగాని సాయినిహాల్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారని ఆదర్శవాణి హైస్కూల్ హెచ్‌ఎం మణికంఠ రవి తెలిపారు. ఈమేరకు సాయినిహాల్‌ను మంగళవారం పాఠశాల చైర్మన్ నాగనబోయిన రవి, ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు.

క్రషర్, క్వారీల తనిఖీ

సంగెం : రెవెన్యూ, మైనింగ్, పోలీస్, ఐబీ అధికారుల బృందం మండలంలోని క్రషర్లు, క్వారీలను తనిఖీ చేశారు. మండలంలోని లోహితలో గల శ్రీలక్ష్మి మెటల్స్ స్టోన్ క్రషర్, శ్రీలక్ష్మి క్వారీ, మిత్ర స్టోన్ మెటల్స్, వి. అనిల్ క్వారీలను మంగళవారం అధికారుల బృందం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యాజమానుల నుంచి అనుమతి పత్రాలు పరిశీలించారు. ఐబీ ఈఈ సునీత, తహసీల్దార్ రాజ్‌కుమార్, మామనూర్ ఏసీపీ తిరుపతి, ఏడీ మైనింగ్ రవిశంకర్, ఎంపీఓ కొమురయ్య, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఏఈ సుభాష్, మైనింగ్ ఆర్ఐ శేఖర్, సర్వేయర్ పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



నర్సంపేట రూరల్ : నర్సంపేట మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ వర్ధంతిని ఈనెల17న (గురువారం) గీసుగొండ మండలం మచ్చాపూర్ గ్రామంలో నిర్వహించనున్నట్లు ఎంసీపీఐ(యూ) డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి అన్నారు. నర్సంపేట మండలంలోని మాధన్నపేటలో ఓంకార్ వర్ధంతి కరపత్రాలను ఆవిష్కరించారు.

రేపు స్క్రాప్ మెటీరియల్‌కు వేలం

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్‌లో స్క్రాప్ మెటీరియల్‌కు వేలం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ జ్యోతి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ నాంపెల్లి శిరిష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న (గురువారం) ఉదయం 10 గంటలకు పాఠశాల ఆవరణలో స్క్రాప్ మెటీరియల్‌కు వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని కాపాడిన పోలీసులు

మడికొండ : కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని మడికొండ పోలీసులు కాపాడి కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుగ్గొండి మండలం మందపల్లికి చెందిన రాసమల్ల రమేష్ (27) హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. దసరా పండుగకు గ్రామానికి వచ్చి ఇంట్లో గొడవపడి మనస్తాపం చెంది సోమవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి సూసైడ్ నోట్ రాసుకొని, వాట్సాప్ కాల్ ద్వారా ఇంటికి ఫోన్ చేసి చనిపోతున్నానని చెప్పాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారంతో మడికొండ-అయోధ్యపురం రైల్వే ట్రాక్ వద్దకు బ్లూకోర్టు హెడ్ కానిస్టేబుల్ రామనాథం, కానిస్టేబుల్ వాసు చేరుకుని యువకుడి ప్రాణాలు కాపాడారు. మంగళవారం ఉదయం యువకుడి కుటుంబ సభ్యులను మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి వారికి రమేష్‌ను అప్పగించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి సత్యం ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలోని 206వ బూత్‌లో సభ్యత్వ నమోదు చేపట్టగా పలువురు యువకులు స్పందించి బీజేపీలో చేరారన్నారు. పట్టణ అధ్యక్షుడు పెద్దూరి రాజు, వరంగల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు ఐత రవి, 3వ వార్డు కౌన్సిలర్ కొండేటి అనిత, పీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేటలో..

నర్సంపేట : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి బాల్నె జగన్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 13వ వార్డు 152వ బూత్‌లో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు.

పరామర్శ

రాయపర్తి : డెంగీతో బాధపడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్‌ను మంగళవారం బీఆర్ఎస్ మండల నాయకులు పరామర్శించారు. మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మదు, ఎండీ అశ్రఫ్‌పాషా, కొమ్ము రాజు పాల్గొన్నారు.

ఝాన్సీరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిని మంగళవారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. మండల యూత్ అధ్యక్షుడు ఎండీ మహమూద్, మైనార్టీసెల్ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్రోజ్‌ఖాన్, నాయకులు మచ్చ నీలయ్య, మల్యాల నర్సింహమూర్తి, కోతి వీరయ్య, సుభద్ర, గారె భిక్షపతి, ఎండీ రఫీ, ఎండీ గౌస్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఐఎస్ఆర్‌లో విక్రమ్‌కు 48వ ర్యాంక్

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటకు చెందిన మోడెం విక్రమ్ సీఐఎస్ఆర్(ఎన్ఈటీ) ఫలితాల్లో ఆల్ ఇండియా 48వ ర్యాంక్ సాధించాడు. ఈ మేరకు విక్రమ్‌ను గ్రామస్తులు అభినందించారు.

అభినందన

నర్సంపేట : నర్సంపేటలోని విజడమ్ హైస్కూల్ విద్యార్థిని ఉప్పు హని ఎన్‌సీసీలో కల్చరల్ విభాగంలో ప్రతిభ కనబర్చి ఈనెల 16నుంచి 25వ తేదీ వరకు సికింద్రాబాద్‌లో జరిగే ఇంటర్ గ్రూప్ ఈజీసీ క్యాంపునకు ఎంపికైంది. ఈ సందర్భంగా హనీని విజడమ్ స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ జావెద్, కరస్పాండెంట్ జహంగీర్, అకాడమిక్ అడ్వైజర్ నాజియా ఇక్బాల్, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ప్రకాశ్, ఎన్‌సీసీ ఏఎన్ఓ థర్డ్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

మానవతావాది రతన్‌టాటా

దుగ్గొండి : ప్రముఖ వ్యాపారవేత్త, మానవతావాది, మనసున్న మహనీయుడు రతన్‌టాటా అని నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని గిర్నిబావిలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం రతన్‌టాటా చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగరావు, లింగారెడ్డి, పెండ్లి వెంకటేశ్వర్లు, యాదవ రెడ్డి, డ్యాగం శివాజీ, రవివర్మ, కోరె రాజేష్, అజ్మీరా తిరుపతి, బండారి ప్రకాశ్, నాగరాజు, మల్లేష్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న అంబటి శ్రీనివాస్

నర్సంపేట : ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు పోరులో ఆర్థికంగా, సామాజికంగా చితికిపోయిన ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాలని ఉద్యమ నాయకుడు అంబటి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో మంగళవారం ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చి, అన్ని విధాల ఆదుకుంటామని ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను ఆదుకోవాలని కోరారు. ఉద్యమకారుల హక్కులు, ఆకాంక్షల సాధన, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. త్వరలో మరోసారి ఏర్పాటు చేయబోయే సమావేశం ద్వారా ఉద్యమకారుల కార్యాచరణపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమావేశంలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీశ్వర్, ఎస్‌కె.జావిద్, సాంబరాతి మల్లేషం, బొనగాని రవీందర్, సోల్తి సాయికుమార్, గుంటి రాంచందర్, కల్లెపల్లి ప్రణయ్‌దీప్, గుడిపూడి అరుణరాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

బోధన రుసుము చెల్లించాలి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యం

నర్సంపేట : ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలకు ప్రభుత్వం బకాయి ఉన్న బోధనా రుసుమును వెంటనే చెల్లించాలని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యజమానులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీఓకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ ప్రాంత కళాశాలలు కేవలం ప్రభుత్వం ఇచ్చే ఉపకార వేతనాలపై ఆధారపడి పనిచేస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత కళాశాలలు ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నాయని, కానీ మూడేళ్లుగా ప్రభుత్వం ఇచ్చే ఉపకార వేతనాలు మంజూరు కాకపోవడం వల్ల నిరుద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి, అద్దె భవనాలకు కిరాయి ఇవ్వలేని సంక్షోభంలో యజమాన్యాలు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 ఆగస్టు, సెప్టెంబర్ గత ప్రభుత్వం విడుదల చేసిన ఉపకార వేతనాలు మంజూరు టోకెన్లు వచ్చి ప్రభుత్వం దగ్గర దాదాపు రూ.600కోట్లపైనే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నేటికి వాటికి మోక్షం కలగలేదని, ఇంకా మంజూరు కాని ఉపకార వేతనాలు మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కళాశాలలు నిర్వహించలేని స్థితిలో ప్రైవేటు యాజమాన్యాలు ఉన్నాయన్నారు. దిక్కులేని పరిస్థితుల్లో ప్రైవేట్ యాజమాన్యాలు నిరవధికంగా డిగ్రీ, పీజీ కళాశాలలను మూసివేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. పెండింగ్ బకాయిలను తక్షణమే ఇప్పించాలని కోరారు. బకాయిలను విడుదల చేసే వరకు నిరసన కొనసాగిస్తామన్నారు. రాబోయే డిగ్రీ సెమిస్టర్, గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలను బహిష్కరించడానికి వెనుకాడబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాల యజమానులు గోగుల ప్రభాకర్‌రెడ్డి, జీజుల సాగర్, మోర్తాల రాంరాజ్, బొనగాని రవీందర్, మాచర్ల రమేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో రోగాలు దూరం



పర్వతగిరి : చేతుల శుభ్రత వల్ల అతిసార, శ్వాసకోశ వంటి రోగాల నుంచి దూరంగా ఉండవచ్చని ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్ సూచించారు. ఈ మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవ కార్యక్రమం మంగళవారం ప్రధానోపాధ్యాయుడు పాక రమేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. చేతులను శుభ్రంగా ఉంచుకోవడం అతి ముఖ్యమైందన్నారు. అన్నం తినే ముందు, మల విసర్జన తర్వాత చేతులను సబ్బుతో బాగా రుద్ది శుభ్రపర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వచ్ఛ భారత్ కో ఆర్డినేటర్ మలినేని శ్రీనివాసరావు, ఎంపీఓ పాక శ్రీనివాస్, ఎంఈఓ జి.లింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రఘు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.